క్లుప్తంగా

సాగునీటి సంఘాల ఎన్నికలకు సన్నద్ధం కండి

కంచిలి: త్వరలో చేపట్టనున్న సాగునీటి సంఘాల ఎన్నికలకు సన్నద్ధం కావాల్సిందిగా వీఆర్వోలను తహసీల్దార్ ఎస్.రమేష్‌కుమార్ ఆదేశించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయని బుధవారం తెలిపారు. దీని కోసం సాగునీటి సంఘాల ఎన్నికలకు అవసరమైన ప్రక్రియను ఇప్పటి నుంచి ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

నేటి ప్రమాణ స్వీకారానికి తరలిరండి

ఇచ్ఛాపురం రూరల్: నరసన్నపేట వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షుడుగా ధర్మాన కృష్ణదాస్, జిల్లా పార్లమెంటరీ సమన్వయకర్తగా తమ్మినేని సీతారాం, రాష్ట్ర డాక్టర్స్ సెల్ విభాగం అధ్యక్షుడుగా డాక్టర్ సీదిరి అప్పలరాజులు గురువారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు జరగనున్న ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు బుధవారం ఓ ప్రకటనలో కోరారు.

ఉచితంగా మోకీళ్ల శస్త్రచికిత్స



లింగయ్యతో వైద్యులు సంతోష్

ఇచ్ఛాపురం: ఈదుపురం గ్రామానికి చెందిన 65 ఏళ్ల జుత్తు లింగయ్య మోకీళ్ల సమస్యతో బాధపడేవారు. ఎడమ కాలుకంటే కుడికాలు 15 సెంటీమీటర్లు చిన్నగా అయిపోయింది. శస్త్రచికిత్స చేసుకునే స్థోమత లేదు. ఇతనికి వీకేఆర్ ఫౌండేషన్ అండగా నిలిచింది. ఉచితంగా మోకీళ్ల మార్పిడి చేసి కొత్త జీవితాన్ని ఇచ్చారు. లింగయ్య ఆరోగ్యం బాగుందని స్థానిక వీకేఆర్ ఆస్పత్రి వైదులు వి.సంతోష్ తెలిపారు.

విద్యుత్ మోటర్ బోరు ప్రారంభం

కవిటి: గొండ్యాలపుట్టుగలో మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.50 లక్షలతో ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్ బోర్‌ను ఎమ్మెల్సీ నర్తు రామారావు బుధవారం ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్ ఉన్నారు.

బదిలీ అధికారులకు సత్కారం

సోంపేట: సోంపేట మండల అభివృద్ధికి ఎంపీడీవో బెందాళం వెంకటరమణ, హౌసింగ్ ఏఈ శివరామకృష్ణ చేసిన సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్సీ నర్తురామారావు, ఎంపీపీ నిమ్మన దాస్ అన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా సోంపేట నుంచి వీరఘట్టం మండలానికి వెళ్తున్న ఎంపీడీవో వెంకటరమణ, డీఈగా పదోన్నతి పొందిన శివరామకృష్ణను జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద ఆధ్వర్యంలో బుధవారం సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. అధికారుల సేవలను కొనియాడారు. సర్పంచ్‌లు తడక జోగారావ పాల్గొన్నారు.

పరిమళించిన మానవత్వం

కవిటి: బొరివంక గ్రామానికి చెందిన మజ్జి సుజాత కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఆమెకు గ్రామస్తులు, యువకులు, హెల్పింగ్ హాండ్స్ సభ్యులు అండగా నిలిచారు. 42,000 రూపాయల నగదు, రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను బుధవారం అందజేశారు. అలాగే గొర్లెపాడుకు చెందిన బూర్లె శ్రీకాంత్ అనారోగ్యంతో ఆస్పత్రి పాలయ్యాడు. వైద్యం కోసం అప్పుచేసి రూ.4 లక్షలు ఖర్చు చేశారు. కష్టాల్లో ఉన్న ఇతనికి ఏపీజే అబ్దుల్‌కలాం ఫౌండేషన్ సంస్థ రూ.15 వేలు సాయాన్ని అందజేసింది. కార్యక్రమాలలో ఏపీజే అబ్దుల్‌కలాంఫౌండేషన్ ప్రతినిధి నర్తు సోమేశ్వరరావు మాస్టార్, బొరివంక సర్పంచ్ శ్రీరాంప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు దుద్ది సతీష్ ఉన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

సంతబొమ్మాళి: మండల తహసీల్దార్‌గా ఆర్.రమేష్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నూతన తహసీల్దార్‌ను ఆర్‌ఐలు, వీఆర్వోలు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు.

ఎంపీడీవోగా జయంతి ప్రసాద్

సంతబొమ్మాళి: మండలాభివృద్ధి అధికారిగా పి.జయంతిప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది అభినందించారు.

తహసీల్దార్‌గా సీతారామయ్య

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు మండల తహసీల్దార్‌గా గాడి సీతారామయ్య బాధ్యతలు స్వీకరించారు. సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు.

కంటి ఆస్పత్రికి అంబులెన్స్ వితరణ

సోంపేట: ఆరోగ్యవరం కంటి ఆస్పత్రిలో రోగుల ఉపయోగార్థం ఎల్ఐసీ సంస్థ అంబులెన్స్ అందజేయడం అభినందనీయమని ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.గ్రేస్ అన్నారు. రూ. 21 లక్షలు విలువ చేసే అంబులెన్స్ వాహనాన్ని ఎల్ఐసీ అధికారులు బుధవారం అందజేశారు. ఎల్ఐసీ ఎస్.డి.ఎం. శారదప్రసాద్‌దాస్, చీఫ్ మేనేజర్ టి.బిసోయ్, ఎస్.ఎం.రవికిరణ్, సోంపేట, ఇచ్ఛాపురం బ్రాంచి మేనేజర్లు వెంకటేష్ పాల్గొన్నారు.

అగ్నిగుండంలో నడిచిన భవానీలు

ఇచ్ఛాపురం రూరల్: లొద్దపుట్టిలోని భవానీ దీక్షా పరులు బుధవారం అగ్ని గుండాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భవానీ మాలధారణ చేసిన భక్తులు భక్తి శ్రద్ధలతో అగ్ని గుండంపై నడిచి మొక్కులు చెల్లించుకున్నారు.

ట్రాఫిక్ వలయంలో కాశీబుగ్గ!



ఇరుకైన ఇన్‌గేటులో వస్తున్న బస్సు



బస్సులతో నిలిచిపోయిన ట్రాఫిక్

- ప్రమాదకరంగా బస్టాండ్ ప్రాంతం
- ఏ బస్సు ఎటు వెళ్తుందో తెలియని వైనం
- ప్రమాదాలకు గురవుతున్న జనం

కాశీబుగ్గ:

కాశీబుగ్గ.. చిన్న పంచాయతీ నుంచి పక్కనే ఉన్న పలాస పంచాయతీతో కలిసి మున్సిపాలిటీగా అవతరించింది. అంతటితో తన ఎదుగుదలను ఆపకుండా పలాస నియోజకవర్గానికి, పలాస రెవెన్యూ డివిజన్‌కు గుండెకాయగా మారింది. అంతటి అభివృద్ధి చెందుతున్న ప్రాంతానికి రాకపోకలు చేయాలంటే కాశీబుగ్గ పట్టణమే ప్రధానంఆధారం. అటువంటి కాశీబుగ్గ ప్రస్తుతం ట్రాఫిక్ వలయంలో చిక్కుకుంది. ప్రయాణికులకు ప్రాణాంతకంగా మారింది. రోజుకు వేలాది మంది ప్రయాణించే బస్ స్టేషన్‌లోకి వెళ్లాలంటే పెద్ద సాహసమే చేయాలి. పాలకులు, పోలీసులు పట్టించుకోక పోవడంతో ట్రాఫిక్‌లో చిక్కుకొని జనం విలవిల్లాడుతున్నారు.

నిత్యం రద్దీగా..

పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో అత్యంత రద్దీగా ఉండే కాశీబుగ్గ బస్టాండ్‌లో నిత్యం పది వేల నుంచి పదిహేను వేల మంది రాకపోకలు జరుపుతుంటారు. ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో ఉన్నటువంటి అతిపెద్ద బస్టాండ్ కావడంతో ప్రయాణికులతో కళకళలాడుతుంటుంది. అయితే ఇక్కడ ప్రయాణికులు కూర్చోడానికి కుర్చీలు, నిలబడేందుకు నీడ, తాగడానికి నీరు ఉండదు. ఇక బస్ ఎక్కాలంటే ఎంతో ధైర్యం అవసరం. రెండు మూడు బస్‌ల మధ్య నుంచి అతికష్టంపై ఎక్కాల్సిన బస్సు వద్దకు చేరుకోవాల్సిందే. ఇంతలో కొన్ని బస్సులు వెనుక్కు.. ఇంకొన్ని ముందుకు తీసేలోపల ఏమైనా జరగవచ్చు. 20 ఏళ్ల క్రితం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఈ బస్టాండ్‌ను నిర్మించారు. అయితే ఆ తరువాత వచ్చిన ప్రభుత్వాలు దీని అభివృద్ధిని పట్టించుకోలేదు.

బస్టాండ్‌లో ప్రధాన సమస్యలు..

- బస్టాండ్‌లో ఏబస్సు ఎక్కడ ఆపాలో, ఏ ప్రాంతానికి వెళ్లాలో తెలియజేసే సూచక బోర్డుల్లేవు
- బస్టాండ్‌లోనికి బస్‌లు ప్రవేశానికి ఇరుకైన ఇన్‌గేటు ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.
- బస్‌లు వెనుక్కు, ముందుకు కదిలే క్రమంలో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి.
- బస్టాండ్‌లో రాత్రి పూట విద్యుత్ వెలుగు లేక మహిళలు బస్ స్టేషన్‌లోనికి అడుగు పెట్టాలంటే బయపడుతున్నారు
- వర్షం పడితే ప్రయాణికులకు బదులు ఆవులు, కుక్కలు స్థావరంగా వాడుకుంటున్నాయి
- ప్రైవేటు బస్ యజమానులు అవుట్ గేటును ఇన్‌గేటుగా వాడుకుంటున్నారు. దీంతో ట్రాఫిక్ నిలిచిపోతూ ఇబ్బందిగా మారుతుంది
- బస్ స్టేషన్ ముందు ఆటోలను ఇష్టానుసారంగా నిలిపి వేయడంతో బస్సులను కూడా రోడ్డుపై నిలుపుతున్నారు. ఫలితంగా ట్రాఫిక్‌కు అంతాయం కలుగుతుంది.
- బస్ స్టేషన్ పరిసరాల్లో కొంతమంది అనాధికారకంగా కూరగాయల దుకాణాలు పెట్టడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి



నిబంధనలకు విరుద్ధంగా బస్టాండ్‌లోకి ప్రవేశిస్తున్న ప్రైవేటు బస్సు

ట్రాఫిక్‌ను నియంత్రిస్తాం



కాశీబుగ్గ బస్‌స్టాండు పరిసరాల్లో ట్రాఫిక్‌ను సరిచేసి ప్రయాణికులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపడతాం. ఆటోలు, ఇతర ప్రైవేటు బస్సులు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చూస్తాం. బస్సులు వెనక్కి వచ్చినప్పుడు కండక్టర్ పర్యవేక్షణలో జరిగేలా సూచనలు చేస్తా. బస్టాండ్‌లో సమస్యల పరిష్కారానికి స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రయత్నిస్తాను. బస్టాండ్ పరిసరాల్లో కానిస్టేబుళ్లను ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు చేపడతాం.

–డి.మోహనరావు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, కాశీబుగ్గ

యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలం

- సోంపేట మండల సమావేశంలో ఎమ్మెల్సీ రామారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

సోంపేట: రైతులకు సకాలంలో యూరియా అందజేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపీపీ నిమ్మన దాస్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దాస్ అధ్యక్షతన ఎంపీడీవో వెంకటేశ్వరులు సాధారణ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్సీ రామారావు మాట్లాడుతూ.. రైతులకు ప్రభుత్వం ఎరువులను అందించకపోవడంతో బ్లాక్ మార్కెట్‌లో కొనుక్కోవలసిన దుస్థితి ఏర్పడిందన్నారు. సమయం దాటిన తరువాత యూరియా అందజేస్తే ప్రయోజనం ఉండదన్నారు.అధికార పార్టీ నాయకుల సిఫారుసుల మేరకు పింఛన్లను నిలుపుదల చేయడం అధికారులకు తగదన్నారు. పార్టీలు మారుతాయి తప్పితే.. అధికారులు మారరన్నారు. ఈ విషయాన్ని గుర్తుంచుకుని అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలన్నారు. ఎంపీపీ దాస్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం చేపట్టిన సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లకు నిధులు అందజేయకుండా ప్రభుత్వం కాలం వెల్లదీయడం దారుణం అన్నారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెలించాలన్నారు. బిల్లులు చెల్లించాలని ఏకగ్రీవంగా సభ్యులు తీర్మాణం చేపట్టారు. జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద, వైస్ ఎంపీపీలు శ్రీను, ప్రేమ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి

- టెక్కలి మండల సమావేశంలో సభ్యులు
- సమయ పాలన పాటించని అధికారులు



పెండింగ్ బిల్లులపై నిలదీస్తున్న సభ్యులు

టెక్కలి: గత ప్రభుత్వ హయాంలో పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టామని.. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే చెల్లించే విధంగా అధికారులు చొరవ చూపాలని ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. బుధవారం టెక్కలి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అట్ల సరోజనమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అయితే ఈ సమావేశానికి అధికారులు పూర్తిస్థాయిలో హాజరు కాకపోగా.. మరికొంత మంది సమయపాలన పాటించకపోవడం కనిపించింది. అంతే కాకుండా సమావేశం పూర్తి కాకుండానే వెళ్లిపోవడం ప్రజాప్రతినిధులను విస్తుగొలిపింది. మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సమావేశంలో తమ పంచాయతీల్లో సమస్యలు చెబుదామనుకుంటే అధికారులు పూర్తి స్థాయిలో రాకపోవడం నిరాశ గురిచేసిందని ప్రజాప్రతినిధులు వాపోయారు. ఈ సందర్భంగా కొన్ని గ్రామాల్లో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు పి.రమేష్, ఎం.కిషోర్, తహసీల్దార్ దిలీప్‌చక్రవర్తి, ఎంపీడీవో సీహెచ్.లక్ష్మిబాయితో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

ఆస్పత్రిలో కుర్చీలు ఏర్పాటు



కొత్తగా ఏర్పాటు చేసిన కుర్చీలు

టెక్కలి రూరల్: ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ పరిధిలోని టెక్కలి జిల్లా ఆస్పత్రిలో నూతనంగా కుర్చీలను ఏర్పాటు చేశారు. కొంతకాలంగా రోగులు, వారి బంధువులు కూర్చోవడానికి సరైన సౌకర్యాలు లేకపోవడంతో అవస్థలు పడేవారు. సమస్యపై ఈ నెల ఆరో తేదీన 'జిల్లా ఆస్పత్రిలో రోగుల ఇక్క ట్లు' శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితమైంది. దాని కి స్పందించిన ఆస్పత్రి సూపరింటెండెంట్ బొడ్డేపల్లి సూర్యారావు కుర్చీలను ఏర్పాటు చేశారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

ఇచ్ఛాపురం రూరల్: ఆన్‌లైన్ మోసాలకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇచ్ఛాపురం రూరల్ ఎస్ఐ ఇ.శ్రీనివాస్ అన్నారు. ధర్మపురం గ్రామంలో ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు బుధవారం అవగాహన కల్పించారు.

నిత్య అన్నదానానికి రూ. 50 వేల విరాళం

టెక్కలి రూరల్: సత్యసాయి నిత్య అన్నపూర్ణ సేవా సంఘానికి టెక్కలికి చెందిన వ్యక్తులు రూ.50 వేలు విరాళంగా అందజేశారు. టెక్కలి జిల్లా ఆస్పత్రి ఆవరణలో రోగుల బంధువులకు నిత్యం అన్నదానం చేస్తున్నటువంటి సత్యసాయి నిత్య అన్నపూర్ణ సేవా సంఘానికి ఏలూరి సత్యన్నారాయణ, లక్ష్మీనరసింహులు విరాళాన్ని సమకూర్చారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం రూరల్: అరకబద్ర గ్రామానికి చెందిన నొపడ సోమేష్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. అసలే పేదరికం, ఆపై చికిత్సకు చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకు న్న గ్రామస్తులు చేదోడుగా నిలిచారు. రూ. 62,500 సేకరించారు. ఈ మొత్తాన్ని బాధితుడి కి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు సాడి కాంచన, వైఎస్సార్‌సీపీ నాయకుడు రంగాల కృష్ణారెడ్డి, గ్రామ పెద్దలు రంగాల పుణ్యవాసులు ఉన్నారు.

కళాజాతరలో ప్రదర్శనకు దుర్దశ నాటిక ఎంపిక

కాశీబుగ్గ: పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని బుద్దాల వెంకన్న కళా ప్రాంగాణంలో ఈనెల 19వతేదీన జరగనున్న ప్రపంచ తెలుగు సాహితీ కళాజాతరలో ప్రదర్శనకు దుర్దశ నాటిక ఎంపికైంది. ఈ విషయాన్ని నటుడు డాక్టర్ కుమార్ నాయక్ తెలిపారు.

ఘనంగా 'నట పంచమీ' వేడుకలు

ఇచ్ఛాపురం రూరల్: దసరా ముందు రోజు నట పంచమీ సందర్భంగా బుధవారం ఉత్కళ బ్రాహ్మణులు కొళిగాం గ్రామంలో ఘనంగా నట పంచమీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కిశోర బాలికలను అందంగా అలంకరించి శివాలయం వద్ద ఇసుకతో సైకత శివ లింగానికి పూజలు, పుష్పాలతో అభిషేకం చేసి, దీపారాధన చేశారు.

నగరంపల్లిలో వైద్య శిబిరం

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంని నగరంపల్లిలో విశాఖలోని రుత్విక్ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాని ఏర్పాటు చేశారు. ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ దువ్వాడ శాలిని, పైల కార్తీక్‌ల పర్యవేక్షణలో 200 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. విశ్రాంత జాయింట్ కలెక్టర్ దువ్వాడ మార్కెండేయులు, మాజీ సర్పంచ్‌లు వెంకటకుమార్ చౌదరి, జయరాం ఉన్నారు.

కబడ్డీ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

- మాజీ మంత్రి డాక్టర్ అప్పలరాజు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మాజీ మంత్రి అప్పలరాజు

వజ్రపుకొత్తూరు: కబడ్డీ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణిచాలని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు.ఉద్దానం రామక్రిష్ణాపురంలో జరుగుతున్న జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను బుధవారం పరిచయం చేసుకుని సెమీ ఫైనల్స్‌ను తిలకించారు. జిల్లా నుంచి క్రీడాకారులు ప్రో కబడ్డీ వైపు దృష్టి సారించి అందుకు తగ్గ ఫిట్‌నెస్‌ను సాధించాలన్నారు. రెండు రోజులు పాటు హోరా హోరీగా సాగుతున్న పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 112 జట్లు పాల్గొనగా బుధవారం నాటికి అమలపాడు, గొల్లమాకన్నపల్లి, శ్రీకాకుళం, కేఆర్ స్టేడియం జట్లు సెమీ ఫైనల్స్‌లో తలపడ్డాయి. స్థానిక సర్పంచ్ చింత హేమారావు, మాజీ సర్పంచ్ చింత నారాయణమూర్తి, దున్న సత్యం, వైఎస్సార్‌సీపీ నేతలు దున్న బాలరాజు, కర్ని శ్రీను, కొల్లి భాస్కరరావు, పాతటెక్కలి సర్పంచ్ టి.సుశీల, ఎంఎంఎస్ అధ్యక్షురాలు జల్లు ఉషారాణి, దున్న క్రిష్ణారావు ఉన్నారు.

పీఎం సూర్యఘర్‌పై అవగాహన

టెక్కలి: పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ డిప్యూటీ ఈఈ సీహెచ్ కృష్ణమూర్తి సూచించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సూర్యఘర్ పథకంపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ చార్జీలు లేకుండా సోలార్‌తో విద్యుత్ సదుపాయం పొందడమే కాకుండా మిగులు విద్యుత్‌ను తిరిగి విద్యుత్ శాఖకు అమ్మకాలు చేసే విధంగా సూర్యఘర్ పథకం ఉపయోగపడుతుందన్నారు. మరిన్ని వివరాలకు విద్యుత్ శాఖా కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

ఎన్‌సీసీతో ఉజ్వల భవిష్యత్



శిక్షణకు హాజరైన ఎన్‌సీసీ కేడెట్‌లు

టెక్కలి: ఎన్‌సీసీతో మంచి భవిష్యత్ ఉంటుందని 14వ ఆంధ్రా బెటాలియన్‌కు చెందిన జిల్లా ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి కల్నల్ కేధారినాథ్ సాహు, అడ్మినిస్ట్రేటివ్ అధికారి కల్నల్ ప్రసూన్‌కుమార్ పండా అన్నారు. టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం జిల్లాలకు చెందిన ఎన్‌సీసీ కేడేట్‌లతో ప్రత్యేక క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా క్రమశిక్షణ, వ్యక్తిగత ఆరోగ్యం, పరిశుభ్రత, భావవ్యక్తీకరణ నైపుణ్యాలు, మాదక ద్రవ్యాల వలన కలిగే దుష్ప్రయోజనాలు, ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన, ప్రాణరక్షణ మార్గాలు, పర్వతారోహణ, రైఫిల్ షూటింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు, క్యాంపు కమాండింగ్ అధికారి వి.మహేష్, అడ్యుటెండ్ కెప్టెన్ వై.పోలినాయుడు, కళాశాల ఎన్‌సీసీ అధికారి టి.మురళీమోహన్ పాల్గొన్నారు.

గృహ లబ్ధిదారులందరికీ న్యాయం చేయాలి

- నందిగాం మండల సమావేశంలో సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీరామమూర్తి

నందిగాం: గృహ లబ్ధిదారులందరికీ న్యాయం చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు. 2014–19 మధ్య కాలంలో మంజూరై వివిధ దశల్లో ఉండిపోయి బిల్లులు కాని ఇళ్లకు ప్రస్తుతం చేస్తున్న సర్వే ఒక వర్గానికి చెందిన వారికి కాకుండా లబ్ధిదారులందరికీ చేయాలని సభ్యులు ముక్తకంఠంతో కోరారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీఓ టి.రాజారావు ఆధ్వర్యంలో ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి అధ్యక్షతన నందిగామ మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ.. ప్రస్తుతం గ్రామాల్లో చేస్తున్న గృహ నిర్మాణ శాఖ సర్వేలో ఆయా గ్రామాల్లో ఒక వర్గానికి చెందిన వారి ఇళ్లను మాత్రమే సర్వే చేస్తున్నారని, ప్రభుత్వం ఆ జాబితాలో ఉన్న వారందరికీ చేయాలని ఆదేశాలు ఇచ్చినా అధికారులు పాటించడం లేదని సభ్యులు ధ్వజమెత్తారు. ఎంపీపీ శ్రీరామమూర్తి జోక్యం చేసుకొని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు ఏమిటని ఆ శాఖ వర్క్‌ఇన్‌స్పెక్టర్ శంకర్‌ను ప్రశ్నించారు. దీనికి వర్క్‌ఇన్‌స్పెక్టర్ బదులిస్తూ.. గతంలో సభ్యులు చెప్పినట్లు ఆలా జరిగిందని, కానీ ఇటీవల జిల్లా కలెక్టర్ రివ్యూ చేసిన అనంతరం వంద శాతం సర్వే చేయాలని ఆదేశించడంతో అందరికీ సర్వే చేస్తామని సభ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం వ్యవసాయశాఖపై జరిగిన చర్చలో పలువురు సభ్యులు మాట్లాడుతూ.. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సరపడా ఎరువులను రైతులకు అందజేయలేదన్నారు. ఒక వార్గనికి చెందిన రైతులకు మాత్రమే వ్యవసాయశాఖ సిబ్బంది ఎరువులు ఇవ్వడంతో.. మిగిలిన వారు ఎరువుల కోసం ప్రైవేటు దుకాణాలపై ఆధార పడవలసి వచ్చిందన్నారు. ప్రైవేటు వ్యాపారులు అధిక ధరలకు ఎరువులను అమ్మినా అధికారులు చర్యలు తీసుకోలేదని కర్లపూడి సర్పంచ్ తమిరె రాజుతో పాటు పలువురు సభ్యులు వ్యవసాయాధికారిని నిలదీశారు. సమావేశంలో యర్ర చక్రవర్తి, ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సరస్వతీ నమస్తుభ్యం..

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవి అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు బుధవారం దర్శనం ఇచ్చారు. విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు తెల్లవారుజాము నుంచే మండపాలు, ఆలయాకు వెళ్లి సరస్వతీదేవికి పుస్తకాలు, పెన్నులతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే చాలాచోట్ల అక్షరాభ్యాసాలు.. సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. భక్తులకు ఇబ్బంది లేకుండా ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.

–సాక్షి నెట్‌వర్క్



సోంపేట: సరస్వతీదేవిగా సోంపేట సోమపోలమాంబదేవి



వజ్రపుకొత్తూరు: అమలపాడు దాసరివాని తోటల్లో కొలువైన సరస్వతీదేవి



కవిటి: మాణిక్యపురంలో పూజలందుకుంటున్న మాణికేశ్వరి అమ్మవారు



టెక్కలి: గోపినాథపురంలో సరస్వతీదేవికి పూజలు చేస్తున్న యువకులు, చిన్నారులు



నందిగాం పాఠశాల ఆవరణలోని సరస్వతీదేవిని దర్శించుకుంటున్న ఎంపీపీ ఎన్. శ్రీరామమూర్తి



ఇచ్ఛాపురం రూరల్: లొద్దపుట్టిలో సామూహిక కుంకుమ పూజలు



ఇచ్ఛాపురం: కాళరాత్రిగా స్వేచ్ఛావతి అమ్మవారు



వజ్రపుకొత్తూరు: ఉద్దానం గోపినాథపురంలో కుంకుమ పూజల్లో భక్తులు

వైఎస్సార్‌సీపీ నేతకు సన్మానం

వజ్రపుకొత్తూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి విశేష సేవలందించిన ఉద్దానం రామక్రిష్ణాపురం గ్రామానికి చెందిన సీనియర్ నేత, మాజీ సర్పంచ్ చింత జనార్దనరావును మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి బుధవారం సన్మానించారు. ఆయన పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. సర్పంచ్ చింత హేమారావు, నాయకురాలు పద్మావతి, దేవునల్తాడ ఎంపీటీసీ సభ్యుడు ఎస్.వెంకన్న పాల్గొన్నారు.

నేడు ఆధార్ స్పెషల్ డ్రైవ్

కాశీబుగ్గ: కాశీబుగ్గ, పలాస ఉప తపాలా కార్యాలయం పరిధిలో ఉన్నటువంటి ప్రజల అవసరార్థం ఆధార్ ప్రత్యేక శిబిరాన్ని గరువారం ఏర్పాటు చేస్తున్నట్లు కాశీబుగ్గ సబ్ డివిజన్ తపాల ఇన్‌స్పెక్టర్ వై ఇంద్రసేనా తెలిపారు.

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం, కంచిలి సబ్‌పోస్టాఫీసులో గురువారం నిర్వహించబోయే ఆధార్ స్పెషల్ డ్రైవ్‌ని సద్వినియోగం చేసుకోవాలని సోంపేట సబ్‌డివిజన్ ఇన్‌స్పెక్టర్ నక్క శ్రీకాంత్ కోరారు. ఉదయం తొమ్మిది నుంచి శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు.

దివిటీలతో అమ్మవారికి ఆహ్వానం

కంచిలి: కత్తివరం గ్రామదేవత శైలపుత్రి నడమ్మతల్లి అమ్మవారిని దసరా ఉత్సవాలకు దివిటీ వెలుగులతో గ్రామస్తులు మంగళవారం రాత్రి ఆహ్వానించారు. గ్రామంలోనే ఉండే అమ్మవారిని గ్రామస్తులంతా దివిటీలను చేతపట్టి ఆలయం వద్దకు చేరి 'హరి బొల్లారే దేవుడు సమ్మ'అంటూ ఆహ్వానించారు. ఏటా దసరా మూడు రోజుల ముందు అమ్మవారిని ఆహ్వానించడం ఆనవాయితీ.